చెరువులకు జలకళ



ఇది మడకశిర చెరువు. కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. దీంతో మడకశిర చెరువుకు దాదాపు 40 శాతం నీరు చేరింది. ఫలితంగా మడకశిర పట్టణం తాగునీటి సమస్య నుంచి బయట పడింది. ఇంతకు మునుపు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వరుసగా రెండుసార్లు కృష్ణాజలాలతో చెరువును నింపడంతో ఇంత వరకు తాగునీటి సమస్య ఏర్పడలేదు. అయితే ఈ నీరు ఖాళీ అయి చెరువు పూర్తిగా ఎండుతున్న సమయంలో వరుణుడు కరుణించడంతో ప్రజలు తాగునీటి సమస్య నుంచి బయటపడ్డారు.



ఇది సువర్ణముఖి నది. అగళి మండలంలో దాదాపు 20 కిలోమీటర్ల మేర ఈ నది ప్రవహిస్తోంది. ఈఏడాది వర్షాలు పెద్ద ఎత్తున కురువడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నది పరివాహక ప్రాంతంలో రైతులకు సంబంధించిన వేలాది వ్యవసాయబోర్లు ఉన్నాయి. గత కొన్ని రోజుల నుంచి ఈ నది ప్రవహిస్తూనే ఉండడంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం బాగా పెరిగింది. రెండేళ్ల పాటు వ్యవసాయ బోర్లకు ఢోకాలేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా అగళి మండలంలోని కొన్ని చెరువులు మరువ పారడం, కొన్ని చెరువులకు నీరు చేరడంతో రైతులకు ఊరట లభించింది.

- మడకశిర నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు
- చెరువులు, కుంటల్లోకి చేరిన వర్షపు నీరు
- సాగులోకి రానున్న ఆయకట్టు భూములు
- బోర్లు రీచార్జ్ కావడంతో రైతుల హర్షం

మడకశిర: జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం మడకశిర నియోజకవర్గం. నియోజకవర్గానికి ఉన్న ఏకైక సాగునీటి పథకం హంద్రీనీవా. ఈ పథకం కూడా పూర్తి కాలేదు. ఈ నేపథ్యంలో ఈనియోజకవర్గం రైతులు పూర్తిగా వర్షంపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకోవాల్సిన పరిస్థితి. అది కూడా చెరువులు, వ్యవసాయ బోర్లపైనే ఆధారపడ్డారు. ఇలాంటి పరిస్థితిలో ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయకట్టు రైతులకు ఊరట

నియోజకవర్గంలోని చెరువులకు జలకళ వచ్చింది. గత కొన్ని రోజుల నుంచి వర్షాలు పెద్ద ఎత్తున కురవడంతో చెరువులకు జలకళ వచ్చింది. నియోజకవర్గంలో 47 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. అలాగే పంచాయతీరాజ్‌శాఖకు చెందిన చెరువులు కూడా వందలాదిగా ఉన్నాయి. దాదాపుగా అన్ని చెరువుల్లోకి కూడా కొంత వరకు నీరు చేరడంతో రైతులకు ఊరట లభించింది. పలు చెరువులు మరువపారడం కూడా రైతులకు ఉపయోగకరంగా మారింది. మడకశిర, వైబీ హళ్లి , గుండుమల, హరేసముద్రం చిన్న చెరువు, హేమావతి, శివరం, కెంకర, వలస, నిద్రగట్ట, బసవనపల్లి, అమరాపురం, ఉప్పార్లపల్లి, ముదిగుబ్బ, చిగతుర్పి, హిరేతుర్పి, గుడిబండ, పీసీగిరి, కరికెర, అగళి, రావుడు, ఆలూడి, రొళ్ల, హునిసేకుంట, ఎంరాయాపురం, సీఎం ఘట్ట, రంగనపల్లి, జీజీహట్టి, కాకి, కేబ్యాడిగెర, భైరేపల్లి తదితర చెరువులకు నీరు వచ్చాయి. మిగిలిన చెరువులకు కొంత మేరకు నీరు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతుల ఆయకట్టు భూములు సాగులోకి రావడానికి అవకాశం ఏర్పడింది. మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద దాదాపు 15 వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ భూములు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగులోకి రావడానికి ఈ వర్షాలు దోహదం చేశాయని రైతులు హర్షం వ్యకం చేస్తున్నారు.



మరువ పారుతున్న రావుడి చెరువు

వక్క రైతులకు తప్పిన ఇబ్బంది

నియోజకవర్గంలో దాదాపు 5 వేల ఎకరాల్లో వక్క తోటలు ఉన్నాయి. 10 వేల మంది రైతులు ఈ తోటలపై ఆధారపడ్డారు. పూర్తిగా వ్యవసాయ బోర్లపైనే ఈ వక్క తోటల మనుగడ ఆధారపడి ఉంది. ఇంత వరకు ఈఏడాదిలో వర్షాలు రాకపోయి ఉంటే వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గి చాలా తోటలు ఎండిపోయే పరిస్థితి ఉండేది. అయితే చివరిలో వర్షాలు రావడంతో వక్క తోటలు నీటి గండం నుంచి బయపటపడ్డాయి.

వ్యవసాయ బోర్లకు మళ్లీ జీవం

వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ప్రారంభంలో వర్షాలు రాకపోవడంతో నియోజకవర్గంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పడిపోయింది. అంతే కాకుండా కొన్ని బోర్లు ఎండి పోయాయి. అయితే ప్రస్తుతం విస్తారంగా వర్షాలు రావడంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగి బోర్లకు మళ్లీ ప్రాణం వచ్చింది. అదే విధంగా చాలా గ్రామాల్లో ప్రభుత్వ బోర్లలో నీటి మట్టం తగ్గి తాగునీటి సమస్య కూడా ఏర్పడింది. అయితే ఈ వర్షాలతో తాగునీటి సమస్యకు కూడా చెక్ పడింది.

భూగర్భ జలాలు పెరిగాయి



వర్షాకాలం చివరిలో వరుణుడు కరుణించడం ఎంతో ఆనందంగా ఉంది. కొన్ని రోజుల నుండి విస్తారంగా వర్షాలు పడటంతో రైతులకు ఊరట లభించింది. మైనర్ ఇరిగేషన్, పీఆర్ పరిధిలోని పలు చెరువులకు జలకళ వచ్చింది. భూగర్భ జల మట్టం పెరగడానికి అవకాశం ఏర్పడింది. ఫలితంగా ఈఏడాది రైతుల వ్యవసాయ బోర్లకు ముప్పు తప్పింది. వ్యవసాయ బోర్లు ఎండిపోయే పరిస్థితి నుంచి బయటపడడం ఆనందంగా ఉంది.

– చంద్రప్ప, ఫళారం, గుడిబండ మండలం

పంటల సాగుకు అవకాశం



వర్షాలు విస్తారంగా రావడంతో చెరువులకు జలకళ వచ్చింది. మండలంలోని దాదాపు అన్ని చెరువులకు వర్షం వలన నీరు చేరింది. ఫలితంగా ఆయకట్టు భూముల్లో పంటల సాగుకు అవకాశం ఏర్పడింది. అంతే కాకుండా ప్రస్తుతం చెరువుల కింద సాగు చేసిన వివిధ పంటలకు కూడా నీటి కొరత తీరింది. వర్షాలతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరగడం కూడా రైతులకు సంతోషంగా మారింది. అదనంగా వ్యయసాయ బోర్ల కింద పంటలను సాగు చేసుకోవడానికి వీలు కలిగింది.

– నాగరాజు, అగళి

నీటి గండం తప్పింది



వర్షాలు రావడంతో వక్క తోటలకు నీటి గండం తప్పింది. వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు ఆశించిన స్థాయిలో పడలేదు. దీంతో వ్యవసాయ బోర్లలో నీటి మట్టం తగ్గి వక్క తోటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందన్న ఆందోళన ఉండేది. అయితే కొన్ని రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు వచ్చి చెరువుల్లోకి నీరు చేరడంతో వక్క రైతులకు భారీ ఊరట లభించింది.

– కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

క్లుప్తంగా

నేరాల నియంత్రణపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

పెనుకొండ: మహిళా పోలీసులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించాలని ఎస్‌ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేరాలు, రోడ్డు భద్రత, గ్యాంబ్లింగ్, దొంగతనాలు, మట్కా, క్రికెట్ బెట్టింగ్ తదితర వాటిపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

చెత్తకుండీ తొలగించండి

పెనుకొండ: పట్టణంలోని కొత్తపేట స్కూల్ వద్ద ఉన్న చెత్తకుండీని తొలగించాలని ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు కమిషనర్ శ్రీనివాసులుకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కొత్తపేట స్కూల్ ప్రాంతంలో ఆటో యూనియన్ ఏర్పాటు చేసుకొని ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే ఇటీవల నగర పంచాయతీ ఆధ్వర్యంలో చెత్తకుండీని ఏర్పాటు చేయడంతో ఆటోలు నిలుపుకోవడానికి ఇబ్బందిగా మారిందన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'సోమందేపల్లి'



సోమందేపల్లి జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరి తెలిపారు. సోమందేపల్లిలో శుక్రవారం జరిగిన క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో సోమందేపల్లి ఎలెవెన్స్ – థలా ఎలెవెన్స్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన థలా ఎలెవెన్స్ 16 ఓవర్లో 74 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన సోమందేపల్లి ఎలెవెన్స్ జట్టు 12.3 ఓవర్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి విజేతగా నిలిచింది. క్రీడాకారులకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామస్తులు చంద్ర సూరి, శ్రీనివాసులు, సుదీర్, జబీ, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఏకశిల విగ్రహ నిర్మాణానికి విరాళం

హిందూపురం: పట్టణంలోని సూగురు ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహ నిర్మాణాభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందించారు. స్వర్గీయ నరసింహప్ప సతీమణి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం ట్రస్ట్ సభ్యులకు ఆ మొత్తాన్ని అందించారు. ఏకశిలా ట్రస్ట్ చైర్మన్ చంద్రశేఖర్, రాయల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పెనుకొండ: ప్రతి విద్యార్థి మొక్కలను నాటి సంరక్షించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రత అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

ఖురాన్ చెప్పిన విద్యార్థులకు పురస్కారాలు



నగదు బహుమతులతో విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని ముక్కిడిపేటలోని అరబిక్ పాఠశాలలో ఖురాన్ కంఠస్తం చేసిన ఐదుగురు విద్యార్థులకు అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. శుక్రవారం అరబిక్ పాఠశాల అధ్యక్షుడు రహంతుల్లా సేట్ అధ్యక్షతన ఉత్తమ హఫీజ్ ఖురాన్ పురస్కారాలు, నగదు బహుమతులను ముఖ్యఅతిథులు మౌలానాలు షాబుద్దీన్, ఉస్మాన్ ఘనీ, ఆడిటర్ జబి అందజేశారు.

కరియమ్మకు పూజలు



అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామంలో వెలసిన కరియమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి అమ్మవారికి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రెగ్యులర్ విద్యుత్‌శాఖ అధికారులను నియమించాలి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: నియోజకవర్గం వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెగ్యులర్ విద్యుత్ అధికారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ లైన్లు తెగిపోయినా పట్టించుకునే నాథుడే లేరన్నారు. ఈ ఏడాది మార్చి నెల నుంచి వందలాది మంది రైతులు వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు పొందేందుకు కోసం డీడీలు తీసినా ఇంత వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయలేదన్నారు. రెగ్యూలర్ విద్యుత్‌శాఖ అధికారులు లేని చోట ఒక్క పని కూడా జరగడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఉచిత విద్యుత్‌తో పాటు సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చి రైతులను అన్ని విధాలుగా ఆదుకొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి రెగ్యూలర్ విద్యుత్ అధికారులను నియమించడంతో పాటు డీడీలు చెల్లించిన రైతులకు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా హరికృష్ణ



రొద్దం: రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా హరికృష్ణ ఎంపిక య్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఆర్ఈఎఫ్ కార్యాలయంలో రిజర్వేషన్ ఎంప్లాయీస్ (బీసీ, ఎస్టీ, ఎస్సీ) మానిటరీ ఫెడరేషన్ సమావేశం జరిగిందన్నారు. జిల్లా కార్యదర్శిగా తనను ఎంపిక చేసి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర, ఎండీ నాగభూషణ, అధ్యక్షుడు దాసరి ఆదినారాయణ చేతుల మీదుగా నియమాక పత్రాలు అందుకున్నట్లు పేర్కొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

రొళ్ల: మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలంటూ శుక్రవారం పట్టణంలోని లోక కళ్యాణ్ ప్రజాసాక్షి సమితి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో మానవహారంగా ఏర్పాడ్డారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ఇన్‌చార్జ్ తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లోక కళ్యాణ్ ప్రజాసాక్షి సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మెగా వైద్య శిబిరం

గుడిబండ: పోలీసుల అమరవీరుల సంస్మణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ మునిప్రతాప్ తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆస్పత్రి సహకారంతో పేదలకు కంటి పరీక్షలు, ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

నేడు చింతఫల సాయం వేలం

రొళ్ల: మండల పరిధిలోని మల్లినమడుగు చింతతోపు ఫలసాయాన్ని శనివారం ఉదయం 10 గంటలకు మల్లినమడుగు సచివాలయం ఆవరణలో వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ శారదమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ ప్రకటనలో తెలిపారు.

రేపు ఉచిత ఆరోగ్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం అమరాపురం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, పద్మరాజ్ జైన్, శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. ఈ శిబిరానికి చిత్రదుర్గం నుంచి స్త్రీల వైద్య నిపుణురాలు జ్యోతి, హిందూపురం నుంచి శ్రీ సాయి కంటి నేత్రాలయం నుంచి డాక్టర్ జింకా కృష్ణమోహన్ హాజరవుతారన్నారు.

పీహెచ్‌సీలో తాగునీటి సమస్య తీర్చండి

మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని రోగులు కోరుతున్నారు. చికిత్స కోసం వెళ్లిన సమస్యలో తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది కూడా తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పీహెచ్‌సీలో ఉన్న వాటర్ స్కీమ్ బోరుకు అదనపు పైపులు అమర్చితే తాగునీటి సమస్య ఉండదన్నారు. సంబంధిత అధికారులు అదనపు పైపులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

కందిపప్పుకు డీడీ చెల్లించండి

మడకశిర: మండలంలోని డీలర్లు కందిపప్పుకు జాప్యం చేయకుండా డీడీలు చెల్లించాలని స్థానిక తహసీల్దార్ కరుణాకర్ సూచించారు. నవంబర్ నెలలో రేషన్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ కందిపప్పును పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇంత వరకూ 80 శాతం మంది డీలర్లు మాత్రమే డీడీ చెల్లించారని తెలిపారు. మిగిలిన 20 శాతం మంది డీలర్లు కూడా సోమవారం లోగా డీడీ చెల్లించాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

పరిగి: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వక్తలు తెలిపారు. మండలంలోని మోదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల వైద్యారోగ్య అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యారోగ్య అధికారులు పలు సూచనలు చేశారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'మీకు తెలుసా' అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఫోర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అశ్వర్థ నారాయణ మాట్లాడుతూ యువతీ, యువకులు హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

నేడు చేపల చెరువుల వేలం

చిలమత్తూరు: మండలంలోని చిలమత్తూరు పంచాయతీ పరిధిలోని చిలమత్తూరు చెరువు, ఈదుల కుంటలో చేపలు పెంపకానికి శనివారం పంచాయతీ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామ్లా నాయక్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రూ. 10 వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

అన్ని స్థానాల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

పావగడ: తాలూకా వ్యాప్తంగా త్వరలో జరిగే జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ పార్టీ గెలిచేలా కృషి చేయాలని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకు పిలుపు నిచ్చారు. స్థానిక సాయిరాం మందిరంలో బ్లాక్ కాంగ్రెస్ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్వాభిమాన సిద్ధత సభలో ఆయన మాట్లాడారు. వచ్చే జెడ్పీ, టీపీ ఎన్నికలను ఎదుర్కోడానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు.

30 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం

మడకశిర: నియోజకవర్గంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటి వరకూ 30 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ తెలిపారు. రొళ్ల మండలంలోనే పత్తి పంట భారీ వర్షాలకు దెబ్బ తిన్నట్లు తెలిపారు. మడకశిర మండలంలో 5 ఎకరాల వరి పంట కూడా వర్షాలకు దెబ్బతిన్నట్లు చెప్పారు. అమరాపురం, గుడిబండ, అగళి మండలాల్లో పంటలకు నష్టం కలగలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

అమరాపురం: పోలీసుల అమర వీరుల వారోత్సవాల్లో భాగంగామండలంలోని బసనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం సైబర్ నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. అమరాపురం పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ రామంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. అనంతరం మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మడకశిర: నియోజకవర్గంలో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. తనతో పాటు సీఐలు సునంద, హరికృష్ణ, సిబ్బంది పాల్గొని కర్ణాటక మద్యం అమ్ముతున్న ముగ్గురిని అరెస్ట్ చేశామన్నారు. మడకశిర మడంలం మెళవాయికి చెందిన రత్నమ్మను అరెస్ట్ చేసి 20, గుడిబండ మడంలం మోపురుగుండుకు చెందిన గోపాల్‌ను అరెస్ట్ చేసి 47, మడకశిర మండలం ఏఆర్ రొప్పంకు చెందిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసి 27 చొప్పున మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం తరలించేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని సీజ్‌చేశామన్నారు.

వినికిడి సమస్యపై వైద్య పరీక్షలు

హిందూపురం టౌన్: పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న ఆధ్వర్యంలో గురువారం దీన్ దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్, జాతీయ వినికిడి లోప నిర్మూలన, నియంత్రణ కార్యక్రమం-నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్తంగా వినికిడి సమస్యలున్న వారికి ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపులో 85 మంది రిజిస్ట్రేషన్ చేయించుకోగా, స్పెషలిస్ట్ డాక్టర్లచే స్క్రీనింగ్ పరీక్షలను జరిపారు. వినికిడి యంత్రాలు అవసరమైన వారందరికీ త్వరలోనే అందజేస్తామని దీన్ దయాల్ సొసైటీ స్టేట్ చైర్మన్ రామాంజనేయులు, కోఆర్డినేటర్ పవన్ తెలిపారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

రొళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రోజు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గిరేనాయకనపాళ్యం, గొట్టుగుర్కి తదితర ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు.

నిధుల విడుదల కోసం ఉద్యమ బాట

- 28 నుంచి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనలు
- 6న చలో కలెక్టరేట్‌కు ఎస్‌ఎఫ్‌ఐ పిలుపు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి

హిందూపురం టౌన్: డిగ్రీ, ఇంజనీరింగ్, బీ ఫార్మసీ లాంటి ఉన్నతమైన విద్యలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. దాదాపుగా రూ.3,480 కోట్ల రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు. యువగళం పాదయాత్రలో అధికారం వచ్చిన నెల రోజుల్లో రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ .. నేడు దాని గురించి మాట్లాడడం లేదన్నారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమై, 1, 3, 5 సెమిస్టర్‌లకు పరీక్ష ఫీజులు కట్టాలని యూనివర్సిటీ నుంచి సర్క్యులర్లు వచ్చాయని, కొన్ని ప్రైవేట్ కళాశాలలో యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న మొత్తం డబ్బు చెల్లించాలని విద్యార్థులకు ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే ఈ నెల 28, 29, 30 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు కార్యక్రమాలు చేపడతామన్నారు. నవంబర్ 6న చలో కలెక్టరేట్ ద్వారా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, మంజునాథ్, రంగనాథ్, భూతరాజు, సంతోష్, రఘు, కిరణ్, సురేష్, సుదర్శన్, తిప్పేస్వామి, వినయ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి విరాళం

లేపాక్షి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి బిసలమానేపల్లికి చెందిన వ్యాపారవేత్త లోకేష్ రూ.50,116 విరాళాన్ని శుక్రవారం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందించిన దాతను ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు సన్మానించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

హిందూపురం టౌన్: సైబర్ నేరాలు పెరిగిపోతున్న తరుణంలో సెల్‌ఫోన్ వాడకాన్ని దుర్వినియోగం చేస్తూ విద్యార్థులు, యువత పెడదారిన పట్టకూడదని పట్టణ సీఐ రాజగోపాల్‌నాయుడు తెలిపారు. గురువారం స్థానిక వన్‌టౌన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చట్టాలు, పోలీసు విధులు, నేరాలపై వారికి అవగాహన కల్పించారు. ఎస్‌ఐలు శ్రీధర్, జయరామప్ప, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, అధ్యాపకురాలు ఆశ, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పెనుకొండ: విద్యార్థులు పోలీస్ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో ఆయన శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. డయల్ 100, సైబర్ క్రైం, డ్రగ్స్, గంజాయి, ప్రమాదాలు తదితర వాటిపై వివరించారు.



హిందూపురం: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు

ఘనంగా వాల్మీకి జయంత్యుత్సవాలు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో వాల్మీకి కులస్తులు శుక్రవారం ఘనంగా వాల్మీకి జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక చెరువు కట్ట దిగువ ఉన్న కన్నేరమ్మ బావి వద్దకు మహిళలు, యువకులు డప్పు వాయిద్యాలతో కలశాలను మోసుకుని వెళ్లారు. అక్కడ అమ్మవారికి గంగా పూజ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి గంగా జలంతో గ్రామం చేరుకుని వాల్మీకి చిత్రపటాన్ని గంగా జలంతో శుద్ధి చేసి పూజలు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం కార్యదర్శి అనిల్‌కుమార్, తమ్మడేపల్లి వాల్మీకి కమిటీ అధ్యక్షుడు హనుమంతరాయ, కార్యదర్శి శివానంద తదితరులు పాల్గొన్నారు.



కన్నేరమ్మ బావి వద్దకు కలశాలతో వెళ్లిన మహిళలు

రేపు మడకశిరలో..

మడకశిర: పట్టణంలో ఆదివారం ఉదయం 11 గంటలకు వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని, వేడుకలను విజయవంతం చేయాలని స్థానిక వాల్మీకి సేవా సంఘం నాయకులు కోరారు. పట్టణంలోని వాల్మీకి విగ్రహం వద్దకు మహిళలు జ్యోతులు మోసుకుని రావాలన్నారు.

టమాట లారీ బోల్తా



సోమందేపల్లి: మండలంలోని వెలుగు మాకులపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారిపై టమాట లారీ బోల్తా పడిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బెంగళూరు వైపు నుంచి హైదరాబాద్ వైపు టమాట లోడుతో వెళుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. అతివేగంగా వచ్చి స్పీడ్ బ్రేకర్ వద్ద బ్రేక్ వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశుగణన పోస్టర్ల విడుదల

లేపాక్షి: మండల కేంద్రంలోని పశుసంవర్ధక కార్యాలయంలో పశుగణనకు సంబంధించి పోస్టర్లను ఏడీహెచ్ మోహన్‌రావుతో పాటు పశువైద్య సిబ్బంది శుక్రవారం విడుదల చేశారు. పశుగణన ఇప్పటికే మొదలైందని వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకూ కొనసాగుతుందన్నారు. అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి వివిధ జాతుల జంతువుల సమాచారాన్ని సేకరించాలన్నారు.